సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



19న చలో పులివెందుల మెడికల్ కాలేజ్

చలో పులివెందుల మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. -8లో



ఎస్‌జీఎఫ్ క్రీడలకు 300 మంది హాజరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలకు బుధవారం 300 మంది ఉమ్మడి జిల్లా క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.0/22.9

వాతావరణం

జిల్లాలో బుధవారం 22.9 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏఎఫ్‌యూలో కోర్సులకు అనుమతులు

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ .వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలోని ఆర్కిటెక్చర్ విద్యార్థులకు సీఓఏ(కౌన్సిల్ ఆఫ్ ఆర్టికల్చర్) నుంచి కోర్సులకు అనుమతులు, ఎన్‌రోల్‌మెంట్ నంబర్లు మంజూరయ్యాయని వైస్ చాన్సలర్ విశ్వనాథకుమార్ తెలిపారు. ఇందులో ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి 2020-21, 2021-22, 2022-23 బ్యాచ్‌ల విద్యార్థులకు సీఓఏ నుంచి కోర్సు అనుమతులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.00 గంటలకు జమ్మలమడుగులోని సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్ చదివి ఉండాలన్నారు. 18-40 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన సూచించారు.

బాధ్యతల స్వీకరణ



ఉద్యానశాఖ అధికారిగా బాధ్యతలు చేపడుతున్న సతీష్

కడప అగ్రికల్చర్: జిల్లా ఉద్యానశాఖ అధికారి జి. సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై వైఎస్సార్‌జిల్లా ఉద్యానశాఖ అధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఉద్యానశాఖ అధికారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గతంలో ఎఫ్‌ఏసీ డీహెచ్‌ఓగా పనిచేస్తున్న రవిచంద్ర ఏడీ స్థానంలోకి వెళ్లారు.

జిల్లాలో 14 వేల పాడి పశువుల యూనిట్ల మంజూరు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఈ ఏడాది 14 వేల పాడి పశువుల యూనిట్లను ప్రాథమికంగా గుర్తించామని, దశల వారీగా వీటిని గ్రౌండింగ్ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, పశు సంవర్ధకశాఖ జేడీ శారద తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 12 వేల యూనిట్ల పాడి పశువులను గ్రౌండ్ చేసేందుకు గ్రామ, మండల స్థాయిలో లబ్ధిదారులకు తగిన అవగాహన కల్పించి ఈనెల 30వ తేది నాటికి పూర్తి చేయాలని కోరారు. ఎల్‌డీఎం జనార్దనం, యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ లక్ష్మి సుశీల, పశుసంవర్ధకశాఖ డీడీలు, ఏడీలు, పశు వైద్యులు, డీఆర్‌డీఏ ఏపీడీ, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

సమ్మెకు.. సై



- ఈనెల 22 నుంచి సచివాలయ ఉద్యోగుల ఉద్యమబాట
- డిమాండ్లు తీర్చాలని, పని భారం తగ్గించాలని డిమాండ్
- జిల్లాలో 889 సచివాలయాలు, సుమారు 7600 మంది ఉద్యోగులు



కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డికి సమ్మె నోటీసిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కడప కార్పొరేషన్: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో అక్టోబర్ 2 మహాత్మాగాంధీ జయంతి రోజు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. సరిగ్గా మూడేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు ఒకరోజు ముందే అక్టోబర్ 1 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. తమపై ప్రభుత్వం మోపుతున్న పని భారం తగ్గించాలని, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని వారు కోరుతున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు జేఏసీగా ఏర్పడి అధికారులకు సమ్మె నోటీసులు ఇప్పటికే అందజేశారు. ఈనెల 22వ తేదీ నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టి అక్టోబర్ ఒకటి నుంచి నిరవధిక సమ్మెను చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. వైఎస్సార్ కడప జిల్లాలోని 36 మండలాలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్, 5 మున్సిపాలిటీలు, రెండు నగర పంచాయతీలలో 889 గ్రామ, వార్డు సచివాలయాలు నడుస్తుండగా, వాటిలో సుమారు 7600 మంది ఉద్యోగులు విధులను నిర్వర్తిస్తున్నారు.

వలంటీర్ల బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకే...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడం, పింఛన్ల పంపిణీ, ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు, కార్యక్రమాలను వలంటీర్లు అమలు చేసేవారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేల జీతమిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. 2024లో అధికారంలోకి వచ్చాక వలంటీర్లకు జీతాలు పెంచకపోగా వలంటీర్ల వ్యవస్థనే ఎత్తేసింది. కూటమి పాలనలో వలంటీర్లు లేకపోవడంతో ఆ పనులన్నీ చేసే బాధ్యత సచివాలయ ఉద్యోగులపైన పడింది. దీంతో సహజంగానే సచివాలయ ఉద్యోగులపై అధిక భారం, పని ఒత్తిడి పెరిగింది. ప్రజలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం, ఆధార్, బయోమెట్రిక్ వివరాలు, ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాల సేకరణలతో భారం అధికమైంది.

ఆందోళనకు కార్యాచరణ ప్రణాళిక

తమ సమస్యల పరిష్కారానికి జిల్లాలోని సచివాలయ ఉద్యోగ జేఏసీ సంఘ ప్రతినిధులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు సమ్మె నోటీసులు అందజేశారు. సెప్టెంబర్ 30వ తేదిలోపు తమ డిమాండ్లు పరిష్కరించకపోతే అక్టోబర్ 1వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామన్న సంకేతాలు ఇస్తున్నారు.

డిమాండ్లు ఇవీ...

- ప్రతిసారీ సర్వేల పేరుతో ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురవుతూ, ఆత్మ గౌరవం కోల్పోతున్నాం. వీటి నుంచి విముక్తి కల్పించాలి.
- విద్యార్హతల ఆధారంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు అప్పగించాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలి.
- సమయపాలన లేని, ఒత్తిడితో కూడుకున్న విధుల నుంచి విముక్తి కల్పించాలి.
- సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయించడం ఆపాలి.
- ఆరేళ్లు ఒకే క్యాడర్‌లో సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ప్రొబేషనరీ సమయంలో రావలసిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన టైమ్‌టైమ్ నిర్ణయించాలి.
- పట్టణ స్థానిక సంస్థల్లోని వార్డు సచివాలయాల్లోని ఖాళీలకు 50 శాతం సచివాలయ సిబ్బందితో భర్తీ చేయాలి.
- సర్వేలను ఆయాశాఖల సంబంధిత ఉద్యోగులతో నిర్వహించి, సచివాలయ సిబ్బందిపై భారం తగ్గించాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల స్టేషన్‌సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగేలా ప్రత్యేక విధి విధానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేయాలి.

ఆత్మగౌరవం దెబ్బతింటోంది



సచివాలయ ఉద్యోగులు ఏ విధులు నిర్వహించాలో వాటినే ప్రభుత్వం అప్పగించాలి. అసలు ప్రజల ఇళ్ల వద్దకు సర్వేలు చేయడం, తమకు సంబంధం లేని ఎరువుల విక్రయాల వద్ద విధులను అప్పగించడం మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. తమ విధులేమిటో ప్రభుత్వం నిర్ణయించి జాబ్‌చార్ట్‌ను ప్రకటించాలి. లేదంటే రాష్ట్ర జేఏసీ నిర్ణయం ప్రకారం ముందుకు వెళతాం.
– హీరామియ్యా, జిల్లా అధ్యక్షుడు. గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్

వలంటీర్లు చేసే పనంతా మాపై పడింది



ఇదివరకు 50 ఇళ్లకు ఒక వలంటీరు ఉండేవారు. ఒక సచివాలయంలో 25 క్లస్టర్లు ఉంటాయి. వలంటీర్లు చేసే పనంతా మాపైనే పడుతోంది. డ్యూయల్ బాసిజం మాపై ఎక్కువైంది. అన్ని రకాల పనులు మాతోనే చేయిస్తున్నారు. ఇది చాలా దారుణం. అలాగే పదోన్నతులు కల్పించడానికి తగిన విధి విధానాలు రూపొందించాలి.
– పి. సిద్ధేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం

చిన్నచూపు చూస్తున్నారు



కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. ఒక్క సమస్యకు పరిష్కారం లేదు. కనీస డిమాండ్లు తీర్చకపోగా తమను చిన్నచూపు చూస్తూ ఎగతాళి చేస్తున్నారు. సంబంధం లేని విధులు అప్పగించడమే కాక సర్వేల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులమైన మేము ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఓటీపీలు చెప్పడం లేదు, వాటిని ఎలా పూర్తి చేయాలి. ఉద్యోగుల సంక్షేమం పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. తక్షణమే జాబ్‌చార్ట్‌ను ప్రకటించాలి.
– ఎం. మస్తాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గ్రామ, వార్డు, సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

జిల్లాలో వర్షం

చాపాడులో 80.2 మిల్లీమీటర్ల వర్షం



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో మంగళవారం తెల్లవారుజాము నుంచి బుధవారం ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా కొండాపురం, మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు, కలసపాడు, అట్లూరు మండలాలు మినహా మిగతా 30 మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో చాలా మండలాల్లో ప్రస్తుతం ఉల్లి పంట కోతలు ప్రారంభించారు. తడికి ఉల్లిగడ్డలు దెబ్బతింటాయని ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షం వరిపంట సాగు చేసిన రైతులకు చాలా మేలు.వరికి సోకిన చీడపీడలు తొలిగి పంట ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. మిగతా ఆరుతడి పంటలైన పత్తి, వేరుశనగ, పసుపు, మొక్కజొన్న, సజ్జ పంటలకు, మామిడి, సపోట, చీని, నిమ్మ, డ్రాగెన్ ఫ్రూట్ వంటి ఉద్యాన పంటలకు కూడా ఈ వర్షం మేలేనని రైతులు తెలిపారు. చాపాడులో అత్యధికంగా 80.2 మిల్లీమీటర్లు, కాశినాయనలో అత్యల్పంగా 1 మిల్లీమీటర్ వర్షం కురిసింది.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

చాపాడు	: 80.2	సిద్ధవటం	: 16.2
ఖాజీపేట	: 66.0	లింగాల	: 11.8
కడప	: 62.4	సింహాద్రిపురం	: 11.4
సికెదిన్నె	: 55.8	ఒంటిమిట్ట	: 4.2
బి. కోడూరు	: 47.4	మైదుకూరు	: 4.0
ఎర్రగుంట్ల	: 46.8	పులివెందుల	: 4.0
చెన్నూరు	: 44.4	వీఎన్‌పల్లి	: 3.8
పెండ్లిమర్రి	: 39.6	వేముల	: 3.0
చక్రాయపేట	: 30.0	బిమఠం	: 4.0
వేంపల్లి	: 29.2	పోరుమామిళ్ల	: 2.8
పొద్దుటూరు	: 28.2	రాజుపాలెం	: 2.8
వల్లూరు	: 26.4	ముద్దనూరు	: 2.8
తొండూరు	: 24.6	బద్వేల్	: 1.8
కమలాపురం	: 18.2	గోపవరం	: 1.2
దువ్వూరు	: 16.4	కాశినాయన	: 1.0

విశ్వకర్మకు ఘన నివాళి



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్: శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ కులవృత్తి గొప్పదనాన్ని, వైభవాన్ని, ప్రభావాన్ని, జీవనాధారాన్ని పెంపొందించడమే సాంకేతికతకు మూలపురుషుడైన శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రపంచ తొలి వాస్తు శిల్పి, సృష్టికర్తగా ప్రవచనకారులు దేవశిల్పి విశ్వకర్మను ప్రస్తావించడం సమంజసమైనదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విశ్వకర్మ భగవానుని జన్మదినాన్ని ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న 'విశ్వకర్మ జయంతి'' గా జరుపుకోవడం జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసా చారి, ఎస్డీసీ వెంకటపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖఅధికారులు, పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులు, పాల్గొన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందేలా సేవలు



రక్తదాతలతో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్: విమాన ప్రయాణీకుల మన్ననలు పొందేలా సేవలు అందిస్తున్నామని కడప ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సుజిత్‌కుమార్ పొదార్ తెలిపారు. బుధవారం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కడప ఎయిర్‌పోర్టులో యాత్రి సేవా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. తొలుత వివిధ ప్రాంతాల నుంచి కడపకుచేరుకున్న యాత్రికులకు డైరెక్టర్‌తోపాటు ఇతర అధికారులు స్వాగతం పలికారు.అలాగే రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగాపాల్గొని రక్తదానం చేశారు. అనంతరం అతిథులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డితోపాటు ఓం శాంతి సంస్థ ప్రతినిధులు, రామకృష్ణ మిషన్ సభ్యులు, ఎయిర్‌పోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎంపీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వేముల మండల టీడీపీ నాయకులు

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వైఎస్ జగనన్న పేదల కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుని అందుకు తగిన కార్యాచరణతో నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. అయితే దాదాపు పూర్తయిన మెడికల్ కళాశాలలను పూర్తి కాలేదంటూ ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు వాటిని ప్రైవేట్‌పరం చేయడానికి సిద్ధమయ్యాడన్నారు.ఈ ప్రభుత్వం తీసుకునే చర్యలవల్ల పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు, అలాగే నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందకుండా పోతుందన్నారు. పులివెందులకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు వచ్చి పరిశీలించి ఇక్కడ మెడికల్ కళాశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయని భావించి 50మెడికల్ సీట్లను మంజూరు చేయడం కూడా జరిగిందన్నారు. అయితే పులివెందులపై ఉన్న వివక్షతతో మంజూరైన మెడికల్ సీట్లను కుంటి సాకులు చెప్పి వెనక్కి వెళ్లేలా చేసిన నీచమైన చరిత్ర తెలుగుదేశం పార్టీది అని ఎంపీ అన్నారు. రాష్ట్రంలోని 17మెడికల్ కళాశాలలకు సంబంధించిన లక్ష కోట్ల ఆస్తిని ఈ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడం శోచనీయమన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున అడ్డుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి 12 కుటుంబాలు

మండల కేంద్రమైన వేముల ఎస్సీ కాలనీలోని టీడీపీకి చెందిన 12 కుటుంబాల వారు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డిల ఆధ్వర్యంలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చాగలేటి ప్రతాప్, అలవలపాటి గంగాధర, దారతోటి గుంటెన్న, రాచూరు రాఘవ, కొండూరు శ్రీనివాసులు, ఉలిమెల్ల గంగాధర్, గొందిపల్లె గంగాధర్, గొందిపల్లె కరుణాకర్, చాగలేటి పుల్లయ్య, గొందిపల్లె సుమంత్, కొట్టం శ్రీరాములు, గొందిపల్లె రామాంజులతోపాటు మరికొంతమంది ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెడుతూ ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తుండటంతో విసుగు చెందామన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు బాగా అమలయ్యాయని, రాబోయే కాలంలో ఇంకా అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశ్యంతో పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతి, నాగప్ప, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటం.. హంగామా?

- డీఎస్సీ ఆర్డర్లకు 500 కిలోమీటర్లు వెళ్లాలా!
- మండిపడుతున్న అభ్యర్థులు



కడప ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికి తెర లేపింది. 150 రోజుల పాటు కసరత్తు జరిపి నానా హంగామా చేశారు. తీరా అర్హులకు న్యాయం చేశారా అంటే అదీ లేదు. అనర్హులకు, అనుకూలమైనవారికి ఉద్యోగాలు కల్పించారని ప్రచారం జరుగుతోంది .ఇప్పుడు నియామకపత్రాల పంపిణీ పేరుతో మరో డ్రామా తెరమీదకు తెచ్చారు. ఈనెల 19న విజయవాడ వేదికగా నిర్వహించే కార్యక్రమంలో మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు పంపిణీ చేస్తామంటూ హంగామా సృష్టిస్తోంది. ఉమ్మడి కడప జిల్లాల నుంచి విజయవాడకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై పలువురు మండిపడుతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచక అధికారులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది.


- ఉమ్మడి కడప జిల్లాల వ్యాప్తంగా నిర్వహించిన మెగా డీఎస్సీ కసరత్తు విమర్శలకు తావిస్తోంది.150 రోజుల పాటు సాగదీసి అర్హులకు మొండి చేయి చూపారని పలువురు మండిపడుతున్నారు. ఈనెల 15న మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితాను ప్రచురించారు. ఈ జాబితా ప్రచురించాక వందల సంఖ్యలో హెల్ప్‌డెస్క్‌కు కాల్స్ వస్తున్నట్లు తెలిసింది. ఉద్యోగాలు రాని పలువురు జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు వెళ్లటం న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. అభ్యర్థులకు విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు.
- కూటమి ప్రభుత్వం డీఎస్సీ (డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ) పేరుతో తిలోదకాలిచ్చారని ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం డీఎస్సీ కసరత్తు జిల్లా స్థాయిలోనే జరిగేది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలోనే నిర్వహించారు. ఈ కసరత్తులో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఫలితాలు వెల్లడించిన తర్వాత మెరిట్, రోస్టర్ ప్రకారం విడుదల చేయాల్సిన జాబితా ఆఖర్లో గందరగోళం సృష్టించారు. ఎంపిక జాబితా పేరుతో పలు సార్లు ప్రచురించి, కాల్‌లెటర్లు పంపి, సర్టిఫికెట్లు పరిశీలించారు. తీరా తుది జాబితా ప్రచురించే సమయానికి ఎక్కువ ర్యాంకులు ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు, తక్కువ ర్యాంకులు వచ్చిన అభ్యర్థులకు అనర్హులుగా పేర్కొన్నారు.
- మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు అందజేసే నియామకపత్రాల పంపిణీ కసరత్తును కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రచారంగా మలుచుకుంది. ఈ ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎంపికైన అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా రావాలని విద్యాశాఖ అధికారులు సందేశాలు పంపారు. దాదాపు 400 కిలోమీటర్లు దూరం వెళ్లాలంటే ఎంతో వ్యయప్రయాసాలతో కూడుకున్న పని. ప్రభుత్వం నిర్ణయంతో పలువురు మండిపడుతున్నారు. వైఎస్సార్‌జిల్లా నుంచి 1600 మంది 40 బస్సుల్లో వెళ్లనున్నారు.



డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ: 19వ తేదీ

ఉమ్మడి కడప జిల్లాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు: 628 మంది

జిల్లాలోనే నియామకపత్రాలు అందచేయాలి



డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు జిల్లాస్థాయిలోనే నియమాకపత్రాలు అందచేయాలి. విజయవాడకు రమ్మని చెప్పడం సరి కాదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా చేయడం అన్యాయం. అధికారులు పునరాలోచించాలి.
– సజ్జల రమణారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

21న భీమవరంలో మిస్టర్ ఆంధ్ర పోటీలు

కడప వైఎస్సార్ సర్కిల్ : ఈ నెల 21న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ షేక్ న్యామతుల్లా తెలిపారు. నగరంలోని ఖున్ కా రిస్తా ట్రస్ట్ కార్యాలయంలో నబ్బా బాడీ బిల్డర్స్ సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కడప జిల్లా నుంచి ప్రత్యేక బృందాన్ని తీసుకుని వెళ్తున్నామన్నారు.

అక్షరమే ఆయుధం



కక్ష సాధింపులకు దిగడం హేయమైన చర్య



అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం నిజాలను ప్రచురించే మీడియాపై కక్ష సాధింపులకు దిగడం హేయమైన చర్య. ఏకంగా పత్రికా స్వేచ్ఛను హరించేలా కేసులు నమోదుచేయడం అన్యాయం. భయపెట్టి నిజాలను కప్పివేయాలనుకోవడం అవివేకం. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, పాత్రికేయులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. – డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్యే, బద్వేలు

బేషరతుగా కేసులు ఉపసంహరించుకోవాలి



'సాక్షి' ఎడిటర్‌తో పాటు ఆ పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి ప్రజల గొంతుకను వినిపిస్తున్న పత్రికపై కక్షపూరిత చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికం. పత్రికలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయించడం అంటే కలానికి సంకెళ్ళు వేయడమే. పత్రికల్లో వచ్చిన వార్తలు అభ్యంతరకరంగావుంటే వివరణ కోరాలే తప్ప కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడం సరైనది కాదు. – ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

ఎమ్మెల్యే పీఏ అండతోనే మెప్మాలో అక్రమాలు

మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : అధికార పార్టీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వ్యక్తిగత పీఏ స్వామి అండతో మెప్మాలో అక్రమాలు జరుగుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ మెప్మా పరిధిలో 30వేల మంది డ్వాక్రా సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెప్మా మై స్టోర్ యాప్ ద్వారా టీఈ మహాలక్ష్మి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో లభించే అగరబత్తీలు, ఊరగాయలు, కారంపొడి, పేలాల ముద్దలు, టవాళ్లు తీసుకు వచ్చి యాప్ ద్వారా విక్రయిస్తున్నారన్నారు. ప్రొద్దుటూరులోని సంస్థతో ఒప్పందం చేసుకుని తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రజలకు ఎక్కువ ధరకు అంటగడుతున్నట్లు తెలిసిందన్నారు. 30, 60 సైజు టవాల్ ధర రూ. 55కు తెచ్చి యాప్ ద్వారా రూ.110లకు, 250 గ్రాముల నిమ్మకాయ ఊరగాయ ప్యాకెట్ ధర రూ.60కి తెచ్చి రూ.110కి విక్రయిస్తున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 90 మంది ఆర్పీలు ఉండగా ప్రతి ఆర్పీకి వాటిని అమ్మాలంటూ టార్గెట్ విధించారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని, ఆయన వ్యక్తిగత పీఏ స్వామి అండతోనే ఇదంతా జరుగతోందన్నారు. మూడు పేలాల ముద్దల ప్యాకెట్ రూ.60కు తెచ్చి రూ..120కి అమ్ముతున్నారన్నారు. తమ కార్యాలయంలో కంప్యూటర్లు ఏర్పాటుచేయాలని మహాలక్ష్మి ఆర్పీల వద్ద రూ.1000 చొప్పున రూ.90వేలు వసూలు చేస్తున్నారన్నారు. తన మాట వినని ఆర్పీలను టీఈ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. మెప్మా కుంభకోణంలో టీఈ రూ.20 లక్షల వరకు అక్రమంగా సంపాదించినట్లు తెలిసిందన్నారు. గృహాలకు సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని ఆ కంపెనీతో లాలూచీపడి డ్వాక్రా మహిళలతో ఇంటింటా ప్రచారం చేయిస్తున్నారన్నారు. మెప్మాలో జరిగిన ఈ కుంభకోణంపై మెప్మా పీడీ, ఎండీలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గరిశపాటి లక్ష్మీదేవి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్ రెడ్డి పాల్గొన్నారు.



టవాల్ ధరలో తేడా చూపుతున్న బంగారు మునిరెడ్డి

ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పూలనాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్సార్టీసీ కడప జోన్ పరిధిలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ జోనల్ చైర్మన్ పూల నాగరాజు సూచించారు. కడప నగరం లోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాగునీరు, కుర్చీలు, ఫ్యాన్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, జోన్ వ్యాప్తంగా 1.82 కోట్ల మంది ప్రయాణించారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 ఏళ్లు పైబడిన బస్సులను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కడప జోన్‌కు 500–600 బస్సులు అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ పైడి చంద్రశేఖర్, ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న చలో పులివెందుల మెడికల్ కాలేజ్

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ.. .ఈ నెల 19న చేపట్టిన చలో పులివెందుల మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి, సోషల్ మీడియా, వాలంటీర్ విభాగాల అధ్యక్షులు, సభ్యులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 17 కొత్త మెడికల్ కాలేజీలను మంజూరు చేయించారని, పది మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తిచేసి సుందరంగా తీర్చిదిద్దారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వాటిని ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. గత ప్రభుత్వంపై బురద జల్లుతూ ఎలాంటి సౌకర్యాలు లేవని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలను మెడికల్ కాలేజీ వద్దకు తీసుకుపోయి అక్కడ ఉన్న వసతులు, సౌకర్యాలను, వాస్తవ పరిస్థితులను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయి దత్త, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు వివేక్, నగర యువజన విభాగం అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, నగర వాలంటీర్స్ విభాగం అధ్యక్షుడు వంశీ, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి సునీత, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా రుతిక్



మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన రుతిక్

కడప.కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కె.రుతిక్ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ పట్టణానికి చెందిన కె.రుతిక్ వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. 2019 నుంచి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా సేవలందిస్తున్నారు. రుతిక్ పోరాట పటిమను గుర్తించిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అతడిని ఐటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. బుధవారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా రుతిక్ కలిసి మాట్లాడారు.

పది నెలలుగా విధులకు దుమ్మా

చింతకొమ్మదిన్నె : మండలంలోని విశ్వనాథపురం–1 అంగన్వాడీ టీచర్ వి.అరుణ పది నెలలకు పైగా విధులకు హాజరు కావడం లేదని స్థానికులు తెలిపారు. అంగన్వాడీ టీచర్ పది నెలలపాటు విధుల్లోకి రాకపోయినప్పటికీ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ పీడీ రమాదేవి వివరణ కోరగా.. అంగన్వాడీ టీచర్ అరుణ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్నారని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, స్థానిక మహిళా పోలీసు కలిసి విచారించినా ఆమె ఫోన్‌లో అందుబాటులో లేరన్నారు. బాడుగకు ఉంటున్న ఇంటికి మెమోలు అంటించామని, వేతనం ఆపివేశామని ఆమె తెలిపారు. త్వరలో ఆమెను టర్మినేట్ చేయనున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

ఎర్రగుంట్ల : మండలంలోని హనుమనుగుత్తి గ్రామానికి చెందిన దుద్దేల శ్యామల(42) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు యర్రగుంట్ల పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. హనుమనుగుత్తి గ్రామానికి చెందిన దుద్దేల రమణారెడ్డి కుమార్తె శ్యామల మతిస్థిమితం సరిగా లేదు. శ్యామలకు మెడ వద్ద, కాలికి గాయాలయ్యాయి. ఈ నెల 9న మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చి కనిపించలేదు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఎర్రగుంట్ల : మండలంలోని వెంకన్నగారిపల్లి (కేజీవీపల్లె) గ్రామానికి చెందిన ఎక్కలూరు నవీన్ కుమార్ (36) కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు యర్రగుంట్ల పోలీసులు తెలిపారు. నవీన్‌కుమార్ నాపరాయి గనులలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి భార్య నాగలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నవీన్‌కుమార్ మద్యం తాగేందుకు అలవాటుపడి భార్యతో తరచూ గొడవపడుతుండేవాడు. ఈ నెల 8న మనస్థాపం చెందిన అతడు పురుగుల మందు తాగాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా బుధవారం మృతి చెందారని పోలీసులు తెలిపారు.

డ్రాగా ముగిసిన మల్టీ డే మ్యాచ్‌లు



మల్లిఖార్జున, అనంతపురం (4 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్ జోన్ అండర్–23 మల్టీడే మ్యాచ్‌లు బుధవారం డ్రాగా ముగిశాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు–చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోయింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ప్రారంభించాల్సి ఉండగా వర్షం కారణంగా రద్దు చేశారు.

వైఎస్సార్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో....

వైఎస్సార్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లో 109 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కడప జట్టు 46 ఓవర్లకు 203 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని విజయ్ రామిరెడ్డి 86, ఎస్ఎండీ. ఆయూబ్ 42 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లిఖార్జున నాలుగు, షేక్ కమిల్ మూడు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 5.3 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 26 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్ అధిక్యం సాధించింది. దీంతో మల్టీ డే మ్యాచ్‌లో నెల్లూరుకు–19, చిత్తూరుకు 11, కర్నూలుకు ఆరు, కడపకు ఐదు, అనంతపురానికి నాలుగు పాయింట్లు లభించాయి.

ఎస్‌జీఎఫ్ క్రీడలకు 300 మంది హాజరు



జిల్లా జట్టుకు ఎంపికైన బాలికల జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలకు బుధవారం 300 మంది ఉమ్మడి జిల్లా క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి పేర్కొన్నారు. నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో అండర్–14, 17 వయస్సు విభాగాలకు ఫుట్‌బాల్ , బాక్సింగ్, రగ్బీ, మోడరన్ పెంటతలాన్ క్రీడలకు జిల్లా జట్టు ఎంపికలను చేపట్టారు. పోటీలలో ప్రతిభ కనపరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వారి వివరాలిలా ఉన్నాయి.

అండర్–14 బాలురు : శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఇర్ఫాన్, నిషాంత్‌రాజు, గురు తేజేశ్వర్, వెంకట ప్రణీత్, లెనిన్, గోపీనాథ్, నాగచరణ్, కెవి.ప్రణీశ్వర్, ఆదిత్, శ్రీనివాస్, అఖిల్, భరత్, నాగ చైతన్య, భద్ర, విగ్నేష్ కార్తీయన్, అభిరామ్ సాయివర్మ, మహ్మద్ హుస్సేన్, ధనుష్ సాయికుమార్.

అండర్–17 బాలురు : సాయిరాకేష్, మహేష్‌బాబు, మస్తాన్‌వల్లి, జీవన్ కుమార్, హామీద్, చరణ్, కార్తిక్, మహ్మద్ సుభాన్, జితేంద్ర, రెడ్డిచౌదరి, హేమంత్ కుమార్, ధీరజ్, రేవన్, వెంకట మణిరాజ్, సమీర్, చవనీశ్వర్, కెవిన్ భగవత్, మణికంఠ. **బాలికలు :** లక్ష్మీదేవి, జ్యోత్స్న, హర్షిత, అఖిల, హిమవర్షిణి, నీనగ్న, లక్ష్మీ తులసి, హిమ ప్రియ, అనుష, స్వప్న, ప్రహర్షిత, స్రవంతి, ఐశ్వర్య, జాహ్నవి, అర్చన, అమృత వర్షిణి, గౌతమి.

ఘర్షణలో తల్లి, కుమారుడికి గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలలో జరిగిన ఘర్షణలో తల్లి, కుమారుడికి గాయాలయ్యాయి. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఓబులేసు మద్యం సేవించి రోజూ ఇంటి వద్ద తిడుతూ ఉంటాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా అతను మద్యం మత్తులో చంటి ఇంటి ముందు తిడుతూ నిల్చున్నాడు. కొద్ది సేపటి తర్వాత ఓబులేసు తండ్రి అక్కడికి వెళ్లాడు. వారి మధ్య మాటా పెరిగి అరుణ్ తోయడంతో చంటి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న రాయి విసిరి వేయగా చంటి తల్లి వెంకటలక్షుమ్మ తగిలి గాయమైంది. పక్కనే ఉన్న కత్తి తీసుకొని ఓబులేసు దాడి చేయడంతో చంటి తలకు రక్తగాయాలయ్యాయి. గాయపడిని ఇరువురిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంకటలక్షుమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఐ, ఎస్ఐలు కొట్టారని డీఎస్పీకి ఫిర్యాదు

ప్రొద్దుటూరు క్రైం : స్థల వ్యవహారంలో సీఐ, ఎస్ఐలు తనను కొట్టారని వివేకానందకాలనీకి చెందిన రామసుబ్బయ్య ఆరోపించాడు. ఈ విషయమై అతను బుధవారం సాయంత్రం డీఎస్పీ భావనకు ఫిర్యాదు చేశాడు. స్థలం విషయమై మాట్లాడటానికి సీఐ స్టేషన్‌కు పిలిపించారని, అయితే తమ వాదన వినకుండా తనను కొట్టినట్లు అతను ఫిర్యాదులో పేర్కొన్నాడు. వాస్తవాలు విచారించాలని, విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు. విచారించి చర్యలు తీసుకుంటానని డీఎస్పీ చెప్పినట్లు రామసుబ్బయ్య తెలిపారు..